సాక్షి వనపర్తి

బుధవారం, 2, అక్టోబర్, 2024



వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్
మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది.
వివరాలు 10లో ▸



జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో
ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద కాస్త పెరిగింది.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.3 /22.8
వాతావరణం
ఎండ తీవ్రంగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. సాయంత్రం జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌గా జి.గోవర్ధన్‌సాగర్



వనపర్తి: జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌గా పాన్‌గల్ మండలం మాందాపూర్‌కు చెందిన జి.గోవర్ధన్‌సాగర్‌ను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.వెంకటేశం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు విధేయుడిగా ఉన్నందున ఆయన చొరవతో పదవి దక్కినట్లు తెలుస్తోంది. త్వరలో బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయన సన్నిహితులు తెలిపారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ



కొత్తకోట రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు సెల్‌ఫోన్లకు పంపిన లింకులు అంగీకరించవద్దని, అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎస్‌బీ రత్నం అన్నారు. కొత్తకోటకు చెందిన కొత్త కుమ్మరి రాజు ఆన్‌లైన్ లోన్‌తో మోసపోయానని ఇచ్చిన ఫిర్యాదుతో పాటు మదనాపురం, అమరచింత, పెబ్బేరు పోలీస్‌స్టేషన్లలో నమోదైన సైబర్ ఫిర్యాదులతో మంగళవారం ముగ్గురిని అదుపులోకి తీసుకొని కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. పెద్దమందడి మండలం పిల్లిగుండుతండాకు చెందిన కేతావత్ దినేష్, అతడి తమ్ముడు కేతావత్ నరేష్, పాత్లావత్ విజయ్ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలియడంతో తండాలో అరెస్టు చేసినట్టు వివరించారు. వారి నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన భూములకు సంబంధించిన రెండు డాక్యుమెంట్లు, 9 సెల్‌ఫోన్లు, 5 సిమ్‌కార్డులు, రెండు కార్లు, ఒక బుల్లెట్ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలోనూ 10 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కుర్మయ్యగౌడ్, సిబ్బందిని ఎస్పీ రావుల గిరిధర్ అభినందించారు.

జోగుళాంబ ఆలయ పాలకమండలి నియామకం

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి దేవస్థానానికి నూతన పాలక మండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అమ్మవారి ఆలయంలో జోగుళాంబదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిని ఈ పాలక మండలిని నియమించింది. ఇందులో బి.నాగేశ్వర్‌రెడ్డి, జయరాముడు, జగన్‌మోహన్‌నాయుడు, నాశిరోమణి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, పి.విశ్వనాథ్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, కుర్వ గోపాల్, సురేంద్రస్వామి, జె.సరస్వతి, వెంకటేశ్వర్లు, జి.పులేందర్, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మను నియమిస్తూ జీఓ జారీచేశారు. కాగా ఇందులో డోనర్ కింద మరో సభ్యుడు ఉండాల్సి ఉంది. ఏడాదిపాటు ఈ కాలపరిమితి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. జోగుళాంబ దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పాలక మండలి నియామకానికి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కృషిచేశారు.

బుక్ కీపర్లకు కనీస వేతనం ఇవ్వాలి



వనపర్తి రూరల్: రాష్ట్రంలో అమలవుతున్న జీఓ నంబర్ 60 ప్రకారం బుక్ కీపర్లకు కనీస వేతనం రూ.15,600 చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్ యూనియన్ సీఐటీయూ అనుబంధంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలుపుతూ మాట్లాడారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో సుమారు 100 మంది ఆర్పీలు ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, సునీత, నందిమళ్ల రాములు, సరస్వతి, మంజుల, శ్రీలక్ష్మి, శారద, గోపమ్మ, జయమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఒడుదొడుకుల చెరుకు

ప్రారంభంలో 8 వేల ఎకరాలు.. ప్రస్తుతం 5,100 ఎకరాలు



అమరచింత శివారులో సాగవుతున్న చెరుకు పంట

- ప్రయోజనాలు అందక ఏటా తగ్గుతున్న విస్తీర్ణం
- రెండేళ్లుగా దృష్టి సారించిన ఫ్యాక్టరీ యాజమాన్యం
- ప్రభుత్వ రాయితీల ప్రకటనతో సాగుపై చిగురిస్తున్న ఆశలు

అమరచింత: జిల్లాలోని కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లి సమీపంలో కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటు కావడంతో ప్రారంభంలో రైతులు చెరుకు సాగుకు ఆసక్తి కనబర్చారు. కోతల సమయంలో కూలీల కొరత, డబ్బుల చెల్లింపుల్లో యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు విసిగి రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో లోటుపాట్లను గుర్తించిన యాజమాన్యం కోతల సమయంలో సరిపడా కూలీలను రప్పించడం, ఫ్యాక్టరీకి చెరుకు తరలించిన 15 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తుండటంతో రైతులు తిరిగి చెరుకు సాగుకు ముందుకొస్తున్నారు. ఫ్యాక్టరీ ప్రారంభంలో 8 వేల ఎకరాల్లో చెరుకు సాగు ఉండగా.. ప్రస్తుతం 5,100 ఎకరాలు ఉంది. రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్ పరికరాలను రాయితీపై అందించడానికి ముందుకురావడంతో ఫ్యాక్టరీ యాజమాన్యం, సిబ్బంది గ్రామాల్లో సాగుపై అవగాహన కల్పిస్తూ సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపట్టారు. గతేడాది స్థానికంగా 2.15 లక్షల టన్నులు, జహీరాబాద్ నుంచి అదనంగా చెరుకు కొనుగోలు చేసి మొత్తం 3 లక్షల టన్నుల చెరుకును ఫ్యాక్టరీలో గానుగ ఆడించారు.

ఫ్యాక్టరీ పరిధిలో సాగు ఇలా..
కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ప్రస్తుతం 5,100 ఎకరాల్లో చెరుకు సాగవుతుంది. ఇందులో వనపర్తి జిల్లాలో మూడు వేల ఎకరాలు, నారాయణపేటలో వెయ్యి, జోగుళాంబ గద్వాల జిల్లాలో 500, కర్నూలు జిల్లాలో 600 ఎకరాల్లో చెరుకు సాగవుతుంది. వీరికి కంపెనీ ద్వారా ఎకరాకు రెండు టన్నుల చెరుకు విత్తనం, ఎరువులు, రసాయనాలను ఫ్యాక్టరీ పరంగా అందిస్తుండటంతో రైతులు సాగుపై దృష్టి సారించారు.

వరికి డిమాండ్ ఉండటంతో..
గతంలో చెరుకు సాగు చేసిన రైతులు తక్కువ సమయంలో ఎక్కువ లాభాలొచ్చే వరి సాగుపై దృష్టి సారించారు. వరికి మార్కెట్‌లో డిమాండ్ ఉండటం, ప్రభుత్వం మద్దతు ధర కల్పించడం, సాగునీరు, రవాణా వసతి కల్పిస్తుండటంతో వరిసాగు పెరగడంతో చెరుకు విస్తీర్ణం పడిపోయింది. చెరుకు టన్నుకు రూ.3,366 ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లిస్తుండగా.. వరికి క్వింటాకు రూ.2,200 నుంచి రూ.2,500 ధర పలుకుతుండటంతో చెరుకు సాగు పడిపోయిందని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు.

రాయితీపై డ్రిప్ అందించాలి..



ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు సాగుచేస్తున్న రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించాలి. ఎరువులతో పాటు కొత్త వంగడాలను పరిచయం చేస్తూ దిగుబడి పెరిగే విధంగా యాజమాన్యం చొరవ చూపాలి. సకాలంలో కోత కార్మికులను రప్పించడంతో పాటు ఫ్యాక్టరీకి చెరుకు చేరిన 10 రోజుల వ్యవధిలో రైతులకు డబ్బులు చెల్లించాలి.

– నారాయణ, చెరుకు రైతు సంఘం నాయకుడు, సింగంపేట

టన్నుకు రూ.4 వేలు ఇవ్వాలి..



టన్ను చెరుకుకు రూ.4 వేల ధర గిట్టుబాటు ధర చెల్లించాలి. సకాలంలో కోత కార్మికులను రప్పించడంతో పాటు రాయితీలు రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ విషయంపై అన్ని జిల్లాల్లోని చెరుకు రైతులతో సమావేశం నిర్వహిస్తున్నాం.

– రాజన్న, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, కృష్ణవేణి చెరుకు సంఘం, అమరచింత

సాగు పెంపుపై దృష్టి..



ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు సాగు విస్తీర్ణం పెంపునకు యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. కోత కార్మికులను సకాలంలో రప్పించడంతో పాటు పంట విక్రయించిన రైతులకు పది రోజుల వ్యవధిలోనే పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లిస్తోంది. గతంలో రాయితీపై డ్రిప్ పరికరాలు రాకపోవడంతో సాగు విస్తీర్ణం పడిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం రాయితీపై ఇవ్వడానికి ముందుకు రావడంతో వచ్చే సీజన్‌లో పెంచడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– రాములు, డివిజన్ మేనేజర్, కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ

కూలీల కొరత కూడా..

చెరుకు పంటను సకాలంలో ఫ్యాక్టరీకి తరలించేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నవంబర్ చివరిలో కోతలు మొదలైతే మార్చి, ఏప్రిల్ వరకు కోతలు పూర్తిగాకపోవడంతో ఎండల తీవ్రతకు అగ్ని ప్రమాదాల బారినపడి తీవ్ర నష్టాలను చవిచూసిన పరిస్థితులు ఉన్నాయి. ఫ్యాక్టరీ యాజమాన్యం సరిపడా కోత కూలీలను పిలిపించకపోవడంతో సకాలంలో కోతలు పూర్తిగాక పంట దిగుబడి తగ్గుతోంది. ఇప్పటికైనా యాజమాన్యం సకాలంలో సరిపడా కోత కార్మికులను రప్పించడంతో పాటు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి సాగు పెంపుపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ముంపు బాధితులకు పునరావాసం

వనపర్తి: శంకర సముద్రం రిజర్వాయర్ ముంపు బాధితుల కోసం పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో భూ సేకరణ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతులు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, తాగునీరు, పాఠశాల తదితర సౌకర్యాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఇంకా ఎంతమందికి ప్లాట్లు, పరిహారం ఇవ్వాలో సమగ్ర వివరాలతో నివేదిక సిద్ధం చేసి అందించాలన్నారు. సాగునీటి కాల్వల నిర్మాణాలకు భూ సేకరణను వేగవంతం చేయాలని కోరారు.

మధుమేహ పరీక్షలు తప్పనిసరి..
జిల్లాలో 30 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ మధుమేహ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లాలోని వైద్యాధికారులతో సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల గుర్తింపు, నివారణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలకు కావాల్సిన గ్లూకోమీటర్లు, స్ట్రిప్‌ల కొనుగోలుకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. వారం రోజులుగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి రుగ్మతలతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారానికి 50 చొప్పున క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా లక్ష్యాన్ని నిర్దేశించాలని కోరారు. డీఎంహెచ్‌ఓ డా. జయచంద్ర మోహన్, డిప్యూటీ వైద్యాధికారి డా. సాయినాథ్‌రెడ్డి, ఎన్‌సీడీ అధికారి డా. రాంచందర్‌రావు, ప్రవళిక, డా. మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు
జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం ఆయన ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓలతో కలిసి జిల్లా ఆస్పత్రి, నర్సింగాయపల్లి సమీపంలోని ఎంసీహెచ్‌ను సందర్శించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ఔట్ పేషంట్ విభాగం, లేబర్ వార్డు, పురుషుల వైద్య వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు శస్త్ర చికిత్సలు, వైద్య కళాశాల విద్యార్థుల శిక్షణకు ఉపయోగపడేలా ఆపరేషన్ థియేటర్‌ను సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా ట్రామాకేర్ యూనిట్ ఏర్పాటుకు సైతం చర్యలు తీసుకోవాలని సూచించారు. జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రంగారావు, చిన్న పిల్లల వైద్యుడు డా. చంద్రమోహన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు అండగా ఉంటాం..
జిల్లాలోని వయోవృద్ధులకు జిల్లా అధికార యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సీనియర్ సిటిజన్లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

డిజిటల్ కార్డుల జారీకి సన్నాహాలు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డిజిటల్ కార్డుల జారీకి వివరాలు సేకరిస్తున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడించారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతకుమారి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి కలెక్టర్ పాల్గొని వివరాలు వెల్లడించారు. ఆర్డీఓ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించి జిల్లాలోని ఒక గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డులను ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో రెండు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్ష నిర్వహిస్తూ ఇప్పటి వరకు 5 శాతం పూర్తికాలేదని, ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సూచనల మేరకు ఎల్‌ఆర్‌ఎస్ రెగ్యులరైజేషన్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేష్, ఆర్డీఓ పద్మావతి, రెవెన్యూ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా అధికారులు

గడువులోగా కేసులు పరిష్కరించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి రూరల్: నిర్ణీత గడువులోగా పెండింగ్ కేసులు పరిష్కరించాలని ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశించారు. మంగళవారం ఆయన పెబ్బేరు పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు.. పురోగతి, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తదితర వివరాలను ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కేసుల విచారణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి నేరస్తులు తప్పించుకోకుండా న్యాయస్థానాల్లో

ఎస్పీ రావుల గిరిధర్

తగిన సాక్ష్యాలు ప్రవేశపెట్టి శిక్షపడేలా చార్జ్‌షీట్ ఫైల్ చేయాలన్నారు. కేసుల వివరాలను సీసీటీఎన్‌ఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసుల్లో అలసత్వం ప్రదర్శించొద్దన్నారు. దొంగతనాలు, దోపిడీలు తదితర నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణాలు, గ్రామాల్లోని ముఖ్య ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు హైవేపై వాహన తనిఖీలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ఉన్న ఏటీఎంను పరిశీలించి నిందితులను త్వరగా పట్టుకోవాలని సీఐ రాంబాబు, ఎస్‌ఐను ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వయోవృద్ధులకు ప్రత్యేక చట్టాలు

వనపర్తిటౌన్: ప్రభుత్వం వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించిందని.. పిల్లలు తమ తల్లిదండ్రుల బాగుగోలు చూసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కోరారు. వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లాకేంద్రంలోని వృద్ధులు, అనాథాశ్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వయోవృద్ధుల కోసం చాలా చట్టాలు ఉన్నాయని.. పిల్లలు సరిగా చూసుకోకపోతే వయోవృద్ధుల పోషణ, రక్షణ చట్టం 2007 ప్రకారం న్యాయశాఖ అధికారి, ఆర్డీఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన వాయిదా

1:3 జాబితా రాకపోవడంతో వెనుదిరిగిన అధికారులు

వనపర్తిటౌన్: ప్రభుత్వం సోమవారం డీఎస్సీ ఫలితాలు వెల్లడించడంతో 1:3 జాబితా ప్రకారం అభ్యర్థుల ధ్రువపత్రాల ప్రక్రియ చేపట్టేందుకు మంగళవారం జిల్లాకేంద్రంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ పూర్తి ఏర్పాట్లు చేసింది. డీఈఓ కార్యాలయంలో విధులు నిర్వర్తించే అధికారులు ఉదయమే బాలికల ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు 9 టేబుల్స్‌ను ఏర్పాటు చేసి ఒక్కో టేబుల్‌కు ముగ్గురు నుంచి ఐదుగురి చొప్పున సిబ్బందిని కేటాయించారు. అభ్యర్థులు అధికసంఖ్యలో వస్తే ఇబ్బందులు తలెత్తుతాయని వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను పిలిపించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సాయంత్రం వరకు 1:3 జాబితా రాకపోవడంతో వచ్చిన అధికారులు, ఉపాధ్యాయులు వెనుదిరిగారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులను వివరణ కోరగా.. మెరిట్ జాబితా రాకపోవడంతో కౌన్సిలింగ్ ప్రక్రియ రద్దయిందని, తదుపరి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. అధికారికంగా ధ్రువీకరించేందుకు ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులు సుముఖత చూపలేదు.

పీఆర్టీయూ టీఎస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

వనపర్తిటౌన్: పీఆర్టీయూ టీఎస్ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొద్దిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా సూర చంద్రశేఖర్, సభ్యులను ఏకగ్రీవకంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతామని చెప్పారు. సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐపైనే ఆశలు

- ఇప్పటికే మొదలైన పత్తి దిగుబడి రాక
- బహిరంగ మార్కెట్‌లో దక్కని మద్దతు ధర
- ప్రభుత్వ కేంద్రాలపైనే ఆశలు పెట్టుకున్న రైతాంగం
- కొనుగోలు కేంద్రాలకు టెండర్లు పూర్తిచేసిన అధికారులు



నాగర్‌కర్నూల్ జిల్లా తాండ్ర సమీపంలోని ఓ కాటన్‌మిల్లులో పత్తిని అన్‌లోడ్ చేస్తున్న రైతులు (ఫైల్)

కల్వకుర్తి: ఇప్పుడిప్పుడే పత్తి దిగుబడులు రాక మొదలయ్యాయి. వర్షాలు కురుస్తుండటంతో రైతులు చేతికొచ్చిన పత్తిని తీస్తూ.. వెనువెంటనే అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే.. పత్తి దిగుబడి ప్రారంభమైనా ఇంకా ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువ వస్తుందని రెండేళ్లుగా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. పంట చేతికొచ్చే ప్రారంభంలో జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేస్తున్నామని చెప్పి.. తర్వాత రైతులు బయటి మార్కెట్‌కు వెళ్తున్నారని దాటవేస్తున్నారు. గడిచిన రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతుంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో సుమారు 5.80 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారని వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి.

మార్కెట్‌లో ఇష్టారాజ్యంగా..
రైతులకు పత్తి విత్తనాలు సరఫరా చేసే వ్యాపారులు పంట దిగుబడి వచ్చాక తామే కొంటామని చెబుతున్నా.. కొన్ని రోజులు గడిచాక పత్తి సరిగా లేదని వ్యాపారులు మొహం చాటేస్తున్నారు. మరికొందరు వ్యాపారులు తమకు ఇష్టం వచ్చినట్లుగా ధర చెల్లిస్తున్నారు. పత్తికి మార్కెట్‌లో ప్రారంభ దశలో రూ.9– 10 వేల ధర పలుకుతున్నా.. వ్యాపారులు రూ.6– 7 వేలు మాత్రమే చెల్లిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

టెండర్లు పూర్తి..
ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలో సుమారు 5.80 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేయగా.. సుమారు 41.19 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది పత్తి క్వింటాల్ రూ.7,521 మద్దతు ధర ప్రకటించగా.. తేమ శాతాన్ని బట్టి ధరలో వ్యత్యాసం ఉంటుందని సీసీఐ అధికారులు చెబుతున్నారు. సీసీఐ మాత్రం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా టెండర్లు పిలిచి ఇప్పటికే ఆ పనులను పూర్తిచేసింది. చివరికి మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉందని, గతంలో లాగానే సీసీఐ కొనుగోలు కేంద్రాలను నడపలేమని చేతులు దులుపుకొంటున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఇలా..
ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, నారాయణపేట, మక్తల్, అలంపూర్, గద్వాల ప్రాంతాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి సీసీఐ టెండర్లు పిలిచింది. అయితే గత రెండేళ్లుగా వీటిని ఏర్పాటు చేయడం లేదు. సీసీఐ కేంద్రాలపై సంబంధిత శాఖ అధికారులు మాత్రం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, అందుకు సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో మూడేళ్లుగా పత్తి సాగు ఇలా..

జిల్లా	2022	2023	2024
నాగర్‌కర్నూల్	3,52,429	2,35,530	2,10,970
జోగుళాంబ గద్వాల	2,22,908	1,44,075	1,20,597
నారాయణపేట	2,05,607	1,84,597	1,65,150
మహబూబ్‌నగర్	1,15,380	85,630	79,128
వనపర్తి	21,689	17,411	12,301



ఇబ్బందులు పడ్డాం..



గత రెండేళ్లుగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేక పత్తి రైతులమంతా చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రైవేట్ వ్యాపారుల వద్ద మద్దతు ధర లేక సాగు మానేసే పరిస్థితులు దాపురించాయి. మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న పత్తి రైతులకు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలి. అలాగే రంగు మారిన పత్తిని కూడా కొంటేనే రైతులకు మేలు జరుగుతుంది.

– రవి, రైతు, తాండ్ర, కల్వకుర్తి

మద్దతు ధర ఇవ్వాలి



పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకునేలా మద్దతు ధరను రూ.10 వేలు ఇవ్వాలి. అందుకు అనుగుణంగా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వర్షాకాలం ఆరంభ దశలో అనుకున్నంత స్థాయిలో వర్షాలు రాక, ఇప్పుడు వర్షాలు పడటంతో పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంది. ప్రభుత్వమే సీసీఐ ద్వారా ఎలాంటి పత్తినైనా కొనుగోలు చేసేలా చూడాలి.

– లక్ష్మయ్య, రైతు, జూపల్లి, చారకొండ

దసరా తర్వాత..

పత్తి కొనుగోలుకు సంబంధించి సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు టెండర్లు పూర్తిచేశాం. ప్రస్తుతానికి పంటను పరిశీలించడానికి మా టీం సభ్యులు పూర్తిస్థాయిలో సర్వే చేస్తున్నారు. పంట దిగుబడి వచ్చినా.. ప్రస్తుతం తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. దసరా దాటిన తర్వాత సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేస్తాం.

– రమేష్, సీసీఐ అధికారి, నాగర్‌కర్నూల్